నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్‌ సురేందర్‌ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌, అత్తాపూర్‌ డివిజన్లకు చెందిన ప్రజలు తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను లిఖితపూర్వకంగా ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటారన్నారు.

శంకుస్థాపన



అత్తాపూర్‌: హైదర్‌గూడ (హైందవనగర్‌)లోని ప్రణవ భక్త సమాజం నూతన భవన నిర్మాణానికి ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. పండితుల పేద మంత్రోచ్చరణల నడుమ జరిగిన కార్యక్రమంలో దాత కొలన్‌ జైపాల్‌రెడ్డి దంపతులతో పాటు ప్రణవ భక్త సమాజం బాధ్యులు మోండ్ర నర్సింహ, పుస్తకాల అశోక్‌, హరినాథ్‌, ప్రధాన సలహాదారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నారగూడెం మల్లారెడ్డి, కొమురయ్య, కోలన్‌ సుభాష్‌రెడ్డి, మేడం రామేశ్వరరావు, పెంటారెడ్డి, నల్లింగ్‌ రమేష్‌, సాబాద విజయ్‌కుమార్‌, జయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధుల్లో అంధకారం



పెద్దగోల్కొండలోని ఓ వీధి

శంషాబాద్‌ రూరల్‌: మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద గోల్కొండలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఎదురుగా వచ్చే వారిని గుర్తు పట్టలేనంతగా వీధులో చీకట్లు అలుముకుంటున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాల మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

'కోట'లో పర్యాటకుల సందడి

గోల్కొండ: పర్యాటకుల రాకతో గోల్కొండ కోట సందడిగా మారింది. వరుస సెలవులు కావడంతో రెండు రోజులుగా పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారని గోల్కొండ కోట సీనియర్‌ పరిరక్షణ అధికారి మల్లేశం తెలిపారు. ఆదివారం ఉదయం నుంచే కోటలో పర్యాటకుల తాకిడి మొదలైంది. పర్యాటకులతో గోల్కొండలోని నగీనాబాగ్‌, ఆయుధాగారం, అక్కన్నమాదన్న కార్యాలయం, సైనికుల బ్యారెక్స్‌ తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. వేల సంఖ్యలో వచ్చిన పర్యాటకులతో గోల్కొండ చౌరస్తా, బడాబజార్‌, బాలాహిస్సార్‌ తదితర ప్రాంతాల్లోని షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

నేత్రోత్సవం.. నృత్యోత్సవం



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్‌ కూచిపూడి డ్యాన్స్‌ గురువు డాక్టర్‌ రమాదేవి రసోల్లాస్‌ నృత్యోత్సవాన్ని నిర్వహించారు. భరతనాట్య ప్రదర్శనలో దెబ్జాని చటర్జీ మీరా భజన, ఠాగూర్‌ సంగీత గీతం, డాక్టర్‌ మధుసూదన్‌ భరతాంజలి కేరళ నటనం ప్రదర్శనలో కృష్ణగాథ, శ్రీరామచంద్ర కృప అంశాలను ప్రదర్శించారు. భరతనాట్య ప్రదర్శనలో శబ్దం, తిల్లాన అంశాలను ఎస్‌ రమ్య ప్రదీప్‌ ,డాక్టర్‌ అతిరా, సౌమ్య రామస్వామి.. కృష్ణ జననశబ్దం, కళింగ తిల్లాన అంశాలను ప్రదర్శించారు. నాట్యకళా కుశల సాగర అవార్డు 2025ని పియాల్‌ భట్టాచార్యకి ఇచ్చి సత్కరించారు. ఎస్‌పి భారతి ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

నేడు రుద్రాభిషేకం

డబీర్‌పురా: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని కోమటివాడిలోని శ్రీరామ మందిర్‌లో సోమవారం పరమేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు పంచామృత సహిత రుద్రాభిషేకం, అన్నాభిషేకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 7 గంటలకు షోడశోపచార పూజ, మంగళ హారతి, తీర్థ ప్రసాదాల పంపిణీ చేపడతామన్నారు. బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

గణేశ్‌ మండపాల ఏర్పాటుకు...

పోలీసుల అనుమతి తప్పనిసరి

ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి
- విద్యుత్‌ శాఖ అనుమతులు పొందాలి
- నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాం
- నిర్వాహకులు సహకరించాలి
- రాజేంద్రనగర్‌ ఏసీపీ శ్రీనివాస్‌



టి.శ్రీనివాస్‌, రాజేంద్రనగర్‌ ఏసీపీ

రాజేంద్రనగర్‌: గణేశ్‌ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతులను తీసుకోవాలని రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఏసీపీ టి.శ్రీనివాస్‌ తెలిపారు. తన కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో ఆదివారం మాట్లాడారు. గణేశ్‌ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన అంశాలను ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... అనుమతులు ఉంటేనే మండపాల్లో గణనాథులను ప్రతిష్ఠించాలని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత సంవత్సరం 1,005 మండపాలకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మండపాలలో వినాయకులను ప్రతిష్ఠించే వారు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఏసీపీ స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది స్టేషన్ల వారీగా ఇప్పటికే మండపాల నిర్వాహకులకు సూచిస్తున్నట్లు వెల్లడించారు.

- కొత్తగా కాలనీలు, బస్తీలలో ప్రతిష్ఠించే వారు తప్పనిసరిగా పోలీసు శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాలను వేసే వారు ఇతరులకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.
- మండపాలకు విద్యుత్‌ కనెక్షన్‌ కోసం విద్యుత్‌ శాఖ నుంచి అనుమతి తప్పనిసరి అన్నారు.
- శరన్నవరాత్రుల అనంతరం గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో తగు జాగ్రత్తలను తీసుకోవాలని ఏసీపీ శ్రీనివాస్‌ సూచించారు. ఆన్‌లైన్‌లో నిమజ్జనం చేసే రోజును పొందుపరుస్తారన్నారు. అదే రోజు నిమజ్జన ఊరేగింపును నిర్వహించాలని ఆయన తెలిపారు.
- పత్తికుంట, పల్లెచెరువులకు అత్తాపూర్‌, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్ల నుంచే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను తరలిస్తారన్నారు. ఇందు కోసం తగిన ఏర్పాట్లను చేస్తున్నట్లు వెల్లడించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నతాధికారులతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి తగు చర్యలను ప్రారంభించామన్నారు.
- గణేశ్‌ మండపాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎక్కడ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.
- గణేశ్‌ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని ఏసీపీ శ్రీనివాస్‌ కోరారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. మండపాల నిర్వాహకులు తమ మండపాల్లో 24 గంటల పాటు అందుబాటులో ఉండాలన్నారు. మండపాల నిర్వాహకులతో స్టేషన్లు, సెక్టార్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.

డీజేలకు అనుమతి లేదు...

గణేశ్‌ నిమజ్జనం సమయంలో డీజేలను ఎవరూ ఏర్పాటు చేయవద్దని ఏసీపీ స్పష్టం చేశారు. డీజేలకు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. డీజేలు ఉపయోగిస్తే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు వినియోగించిన నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండపాల వద్ద ఇతరులకు ఇబ్బంది కలుగకుండా సౌండ్‌ బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఎలాంటి సమస్యలున్నా ఫిర్యాదు చేయండి...

గణేశ్‌ మండపాల వద్ద ఎలాంటి సమస్యలున్నా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ శ్రీనివాస్‌ కోరారు. గుర్తు తెలియని వ్యక్తులు, అనుమానాస్పద వస్తువులు ఏవి ఉన్నా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ నియమ నిబంధనల సూచికను అందిస్తామన్నారు. అందులో పోలీసు అధికారుల ఫోన్‌ నంబర్లు సైతం ఉంటాయని ఏసీపీ వివరించారు.

రహదారి విస్తరణ పనులను పూర్తి చేయాలని ఆందోళన



కేబీ దొడ్డి-రాయన్నగూడ మార్గంలో ఆందోళన చేస్తున్న స్థానికులు

శంషాబాద్‌ రూరల్‌: నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే రహదారిలో అసంపూర్తిగా వదిలేసిన విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్‌ చేస్తూ స్థానికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని కేబీ.దొడ్డి నుంచి రాయన్నగూడ వెళ్లే మార్గంలో సుమారు కి.మీటరు దూరం వరకు రోడ్డు విస్తరణ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. శంషాబాద్‌-మొయినాబాద్‌ మండలాలను అనుసంధానం చేసే ఈ రహదారిలో అడుగడుగునా గుంతలు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను అడ్డుకునేందుకు కొందరు కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడం పద్ధతి కాదన్నారు. రోజూ ఈ రోడ్డుపై విద్యార్థులు, రైతులు, ఉద్యోగులతో పాటు స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. గుంతలు, వరదనీరు నిలవడంతో ప్రయాణం నరకంగా ఉందన్నారు. వాహనాలు మరమ్మతులకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో రహదారిపై దీక్ష చేస్తామని హెచ్చరించారు.

ట్రాఫిక్‌ పోలీసుల వేధింపులు ఆపాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌



సీఐటీయూలో చేరిన ఆటో కార్మికులు

మణికొండ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న ఆటో కార్మికులపై ట్రాఫిక్‌ పోలీసుల వేధింపులను ఆపాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్‌ డిమాండ్‌ చేశారు. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల చౌరస్తాలో ఉన్న ఆటో కార్మికులు ఆదివారం ఆయన సమక్షంలో ఏఐటీయూసీ నుంచి సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చూపిన విధంగా ప్రతి కార్మికుడికి రుణభృతి రూ. 13 వేలు అందించాలన్నారు. ఆటో కార్మికులందరికీ రూ. 10 లక్షల ప్రమాద బీమా, ప్రైవేటు యాపులకు దీటుగా ప్రభుత్వ యాప్‌ తెచ్చి వారి జీవనానికి భరోసా కల్పించాలన్నారు. పెట్రోల్‌, డీజిల్‌ ధరలను తగ్గించాలన్నారు. సీఐటీయూ జిల్లా ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ కార్యదర్శి రుద్రకుమార్‌, మండల కార్యదర్శి నగేష్‌గౌడ్‌, సీనియర్‌ నాయకులు అశోక్‌, మంచిరేవుల చౌరస్తా ఆటో యూనియన్‌ నాయకులు శ్రీనివాస్‌, పద్మారావు, లక్ష్మణ్‌, రమేష్‌, అనంతరావు, దయాకర్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

బైరాగిగూడ-నార్సింగి రోడ్డు

సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న హరీష్‌గౌడ్‌

బండ్లగూడ: బైరాగిగూడ-నార్సింగి వెళ్లే రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నదని వెంటనే అధికారులు చొరవ తీసుకొని శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేసి పరిష్కారం చూపించాలని స్థానిక నాయకుడు నల్లగొప్పుల హరీష్‌గౌడ్‌ కోరారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లుకు కార్పొరేషన్‌ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన సమస్యకు శాశ్వత పరిష్కారం కావడం లేదన్నారు. దీంతో ఈ దారి గుండా ప్రయాణించాలంటే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ రోడ్డు ఆర్మీ ఆధీనంలో ఉండటంతో ఎలాంటి పరిష్కారం లభించడం లేదని విచారం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు, కార్పొరేషన్‌ అధికారులు చొరవతో పలుమార్లు ఈ రోడ్డును తాత్కాలికంగా మరమ్మతులు చేయించినా ప్రయోజనం లేదన్నారు. బీజేపీ నాయకులు పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలను ఇచ్చారన్నారు. మరొకసారి బీజేపీ నాయకులు ఈ సమస్యని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్మీ ఆధీనంలో ఉన్న ఈ రోడ్డును కార్పొరేషన్‌కి కేటాయిస్తే దీన్ని 100 ఫీట్ల రోడ్డుగా విస్తరించి ప్రజా అవసరాల దృష్ట్యా అందుబాటులోకి తీసుకువావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పాదచారులకు దారేదీ?



చింతల్‌మెట్‌ ప్రధాన రహదారి పక్కన ఆపిన ఆటోలు

శాస్త్రిపురం: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు లేక పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి ప్రమాదాల బారినా పడుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా అవసరాలు, పెరుగుతున్న ట్రాఫిక్‌ దృష్ట్యా ఫుట్‌పాత్‌ల నిర్మాణం ఎంతో అవసరం. పాదచారులు నడిచే దారిలేక తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైనే నడవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ఫుట్‌పాత్‌ల ఆవశ్యకతను వివరిస్తూ వాటిని నిర్మాంచాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణల పర్వం...

- ఫుట్‌పాత్‌లు లేకపోవడానికి ప్రధాన కారణం ఆక్రమణలనే చెప్పొచ్చు. సర్కిల్‌ పరిధిలోని చాలా రోడ్లు ఇరుకుగా ఉన్నాయి. దీనికీ తోడుగా రోడ్డు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం జరగడం లేదు. రోడ్లను విస్తరించి ఫుట్‌పాత్‌లను నిర్మించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పలు వ్యాపార సముదాయాల ముందు ఉన్న స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు వెలుస్తున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఫుట్‌పాత్‌ల నిర్మాణం మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ర్యాష్‌గా డ్రైవింగ్‌ చేస్తే చర్యలు తథ్యం



పోలీసుల అదుపులో ర్యాష్‌ డ్రైవింగ్‌ చేస్తున్న యువకులు

రాజేంద్రనగర్‌: వాహనదారులు ప్రమాదకర విన్యాసాలు, ప్రజలకు ఆటంకం కలిగించేలా ర్యాష్‌గా డ్రైవింగ్‌ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సి.హెచ్‌.రాజు హెచ్చరించారు. ఇటీవల మద్యం సేవించి ర్యాష్‌ డ్రైవింగ్‌ చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన బాబానగర్‌కు చెందిన మహ్మద్‌ అబ్దుల్‌ రషీద్‌, చంపాపేట్‌కు చెందిన జాఫర్‌ అహ్మద్‌ షా, బాలాపూర్‌కు చెందిన సయ్యద్‌ అఫ్రోజ్‌ అనే యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి హోండా షైన్‌ వాహనం (ఏపీ12పీ 7745), యాక్టివా (టీఎస్‌10ఎఫ్‌జీ 5061) వాహనాలను స్వాధీనం చేసుకొని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించామన్నారు. ఈ 16వ తేదీన బండ్లగూడ నుంచి ఆరాంఘర్‌ వైపు ముగ్గురు యువకులు రెండు ద్విచక్ర వాహనాలను నడుపుతూ వాహనాలపై మద్యం సేవిస్తూ ప్రజలకు, వాహనదారులు ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ విషయాన్ని ఇతర వాహనదారులు వీడియోలు తీసి రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ పోలీసులకు ఆన్‌లైన్‌లో తెలపగా.. వారిని గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి వారి పత్రాలను పరిశీలించి తదుపరి విచారణ నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించామని వివరించారు.

పీస్‌ కమిటీలు ఆదర్శం

గోల్కొండ: పీస్‌ అండ్‌ మైత్రి కమిటీల ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్‌ అభిలాష్‌ అన్నారు. ఆదివారం సౌత్‌ వెస్ట్‌ జోన్‌ సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ సమావేశం తప్పాచబుత్రలోని ఏకేఎం ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెంట్రల్‌ పీస్‌ అండ్‌ కమిటీ వారు నిరంతరం పేద బడుగు వర్గాలు, పేద విద్యార్థుల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థులకు నోట్‌ బుక్స్‌, పాఠ్య పుస్తకాలు అందించడం గొప్ప విషయమన్నారు. సెంట్రల్‌ పీస్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ అధ్యక్షుడు మోజామ్‌ ఖాన్‌, కౌసర్‌, ఇలియాస్‌, జైనులాబిడున్‌ ఆబేద్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ మేయర్‌ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారులతో చర్చించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మాజీ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని 1వ డివిజన్‌ శివసాయినగర్‌ లేన్‌-2 కాలనీవాసులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనానికి రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే కాలనీ వాసులు పలు సమస్యలపై ఆయనకు విన్నవించారు. డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్‌, మంచినీరు తదితర అన్ని సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాజేంద్రనగర్‌: బుద్వేల్‌లోని కనకతీగల ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో 2002-03వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 22 సంవత్సరాల తరువాత ఆదివారం అందరూ ఒకేచోట చేరి సందడి చేశారు. ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు అంతా ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చాలా సంవత్సరాల తరువాత అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఏ మిత్రునికి ఎలాంటి ఇబ్బంది ఉన్న అందరూ మిత్రులు కలిసి అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొరని మహేశ్‌, ఈరంకి విక్రమ్‌ గౌడ్‌, సతీష్‌ కుమార్‌, కాందాల శ్రీకాంత్‌ రెడ్డి, సద్ది భాను రెడ్డి, ఎడ్ల వినేశ్‌ కుమార్‌, కాందాల కుశాల్‌ రెడ్డి, ప్రతిభ, శ్వేత (శ్రావణి), అర్చన, భానుప్రసాద్‌, వివేక్‌, బాలాజీ, నటరాజ్‌, జహీర్‌, వివేక్‌, హరి, సాయి, బాలాజీ, సోల్మన్‌ రాజ్‌, సోల్మన్‌, వినయ్‌ బాబు, రాజీవ్‌, రంజాన్‌ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌ బ్రేకర్లు సరే.. సూచికలు ఏవీ?



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు ప్రతి కాలనీలో స్పీడ్‌ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే వాటికి రంగులు వేయకపోవటం.. సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో చీకటి పడితే పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవటంతో ఆయా ప్రాంతాల్లో వాహనదారులకు స్పీడ్‌ బ్రేకర్లు కనిపించే పరిస్థితి లేదు. స్పీడ్‌ బ్రేకర్లు ఉన్నాయంటూ బోర్డులు లేకపోవడం.. రంగులు, రేడియం స్టిక్కర్లు లాంటివి లేవు. ఈ క్రమంలో మణికొండ పయనీర్‌ కాలనీ ప్రవేశంలో శనివారం రాత్రి స్పీడ్‌ బ్రేకర్‌ కనిపించకపోవటంతో ద్విచక్ర వాహనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడ వీధి దీపాలు కూడా వెలగకపోవటంతో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపాలిటీ ఇంజనీరింగ్‌ అధికారులు చర్యలు తీసుకొని స్పీడ్‌ బ్రేకర్ల వద్ద తగు సూచికలు కనిపించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



రాజేందర్‌



రత్నం

శంషాబాద్‌ రూరల్‌: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఇన్‌స్పెక్టర్‌ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... మహారాష్ట్రకు చెందిన సూర్యవంశీ రాజేంద్ర(35), పూజ దంపతులు ఉపాధి కోసం పదేళ్ల కిందట వలస వచ్చి ఇందిరానగర్‌ దొడ్డిలో నివాసుంటున్నారు. ఈ నెల 10న పూజ ఉదయం పనికి వేళ్ల సమయంలో రాజేంద్ర ఇంట్లోనే ఉన్నాడు. స్వగ్రామం వెళ్తానని చెప్పాడు. అదే రోజు సాయంత్రం పూజ పని నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. ఇంటికి తాళం వేసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. భర్తకు చెందిన దుస్తులు, బ్యాగు కనిపించలేదు. అతను స్వగ్రామం వెళ్లి ఉంటాడని భావించింది. దీంతో భర్తకు ఫోన్‌ చేయగా.. స్విచ్‌ ఆఫ్‌ అయింది. అత్తకు ఫోన్‌ చేసి అడగగా అక్కడకు రాలేదని చెప్పింది. దీంతో అతని కోసం అన్ని చోట్ల వెతికినా జాడ తెలియకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

ముచ్చింతల్‌కు చెందిన బొడ్డు రత్నం(48) ఈ నెల 13న నందిగామ మండలం చేగూరులో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. అదే రోజు రాత్రి రత్నం భార్య మంజుల తన కూతురుకు ఫోన్‌ చేసి వాకబు చేసింది. అతను కూతురు వద్దకు వెళ్లలేదని తెలియడంతో అన్ని చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు షురూ



పైప్‌లైన్‌లు జరుగుతున్న దృశ్యం

శాస్త్రిపురం: సులేమాన్‌నగర్‌ డివిజన్‌లోని ఎన్టీఆర్‌ నగర్‌లో సీవరేజ్‌ సమస్య తీరనుంది. సంవత్సరాలుగా మురుగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదర్కొన్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రం అవుతుంది. వర్షాలకు మురుగునీరు రహదారులపైకి చేరుతుండటంతో స్థానికంగా దుర్గంధం ప్రబలుతుంది. ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సమస్యను కొద్ది రోజులుగా జీహెచ్‌ఎంసీ అధికారులకు తరచూ ఫిర్యాదులు చేయడంతో స్పందించిన అధికారులు నూతన పైప్‌లైన్‌ పనులను ప్రారంభిచారు. ఆదివారం ఎన్టీఆర్‌ నగర్‌లో మురుగునీటి పైప్‌లైన్‌ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పైప్‌లైన్‌ పనులు పూర్తయితే తమ కాలనీ మురుగునీటి సమస్య తీరుతుందని ఎన్టీఆర్‌ నగర్‌ కాలనీ వాసులు పేర్కొంటున్నారు.

సీపీఎస్‌ రద్దు కోసం 1న మహాధర్నా

- పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి
- పీఆర్‌టీయూటీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: సీపీఎస్‌ రద్దు కోసం సెప్టెంబర్‌ 1వ తేదీన మహాధర్నాను నిర్వహించనున్నట్లు ఈ ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూటీఎస్‌ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్‌ 1వ తేదీన పింఛన్‌ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని పీఆర్‌టీయూటీఎస్‌ రాష్ట్ర శాఖ చేపట్టిన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహా ధర్నాను చేపడుతున్నామన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ హైదర్షాకోట్‌లోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీపీఎస్‌ ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని, సీపీఎస్‌ రద్దు అయ్యేంత వరకు పీఆర్‌టీయూ పోరాటం సాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసే ప్రక్రియ చేపట్టాలని డిమాండ్‌ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఈ మధ్యనే కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57 మెమో ప్రకారం పాత పింఛన్‌ విధానాన్ని వెంటనే అమలు చేయాలని వారు కోరారు. సెప్టెంబర్‌ 1న జరిగే ఇందిరాపార్కు వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమానికి ఆల్‌ ఇండియా ఫెడరేషన్‌ ఆఫ్‌ టీచర్స్‌ ఆర్గనైజేషన్‌ సెక్రటరీ జనరల్‌ సీఎల్‌ రోజ్‌, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారన్నారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి సీపీఎస్‌ రద్దు చేయాల్సిన అవశ్యకతను తెలియజేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి కొనగారి కృష్ణారెడ్డి, గండిపేట మడల శాఖ అధ్యక్షుడు శివరాం, ప్రధాన కార్యదర్శి మధుకర్‌రెడ్డి, రాజేంద్రనగర్‌ అధ్యక్షుడు సుదర్శన్‌, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, బలరాం, జీహెచ్‌ఎం గోవింద, మొయినాబాద్‌ మండల అసోసియేట్‌ అధ్యక్షుడు రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.